
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం : 20 : జూన్ : 2025


యోగాంధ్రకు తరలిరండి IIలో


లాసెట్‌లో 2,4 ర్యాంకులు మనవే.. IIలో


ఆర్టీసీ ప్రయాణికులకు అవస్థలు IIలో

విశాఖ అష్టదిగ్బంధం

- నగరం.. పోలీసుల వలయం
- రాష్ట్ర నలుమూలల నుంచి 10 వేల మంది పోలీసుల రాక
- యోగాంధ్రకు పటిష్ట భద్రతా చర్యలు
- రెండో రోజు స్తంభించిన ట్రాఫిక్
- జాతీయ రహదారిపై వాహనదారులకు చుక్కలు
- ప్రధాని వెళ్లే మార్గంలో ట్రయల్ రన్
- ఆ సమయంలోనూ వాహనాల నిలిపివేత
- ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు


బీచ్‌రోడ్డులో పహారా కాస్తున్న పోలీసులు


డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ : యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా విశాఖ నగరం పోలీసుల అష్ట దిగ్బంధంలోకి వెళ్లింది. అంతర్జాతీయ యోగా వేడుకలకు నగరం ఆతిథ్యమిస్తోంది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు గవర్నర్, సీఎం, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగా దినోత్సవంలో సుమారు 5 లక్షల మంది ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల పరిధిలో యోగాసనాలు వేయనున్నారు. ప్రశాంత వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగేందుకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఐపీఎస్‌లతో పాటు అన్ని స్థాయిల అధికారులు, సిబ్బందిని విశాఖలో మోహరించారు. 10 వేలకు పైగా పోలీసులతో భారీ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే విశాఖ సిటీ పోలీసుల వలయంలోకి వెళ్లిపోయింది. నగరంలో పీఎం, ఇతర ప్రముఖులు పర్యటించే ప్రాంతాల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాలతో పాటు యోగాసనాలు వేసే బీచ్ రోడ్డును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ వైపుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

ట్రయల్ రన్‌తో మరింత ట్రాఫిక్ కష్టాలు

ఈ నెల 20వ తేదీ సాయంత్రం ప్రధాని మోదీ విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి తూర్పు నావికాదళం హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లి రాత్రి అక్కడే బస చేస్తారు. ఐఎన్ఎస్ డేగా నుంచి ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయం వరకు ప్రధాని వెళ్లే మార్గంలో గురువారం పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను నిలిపివేశారు. దీంతో ఆఫీసులు, ఇతర త్రా పనులకు వెళ్లేవారు అధిక సమయం జంక్షన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ప్రముఖుల పర్యటన సమయంలో ట్రయల్ రన్ నిర్వహించడం సర్వసాధారణమైనప్పటికీ.. వరుసగా ట్రాఫిక్‌ను నిలిపివేస్తుండడం, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండడంపై వాహనదారులు విసుగెత్తిపోతున్నా రు. గత రెండు రోజులుగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో స్కూళ్లు, కాలేజీలు, ఉద్యోగా లు, ఇతర పనులకు వెళ్లే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా నగరంలో ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుంది.

వాహనదారులకు నరకం



ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమం విశాఖవాసులకు నరకం చూపిస్తోంది. బీచ్ రోడ్డుతో పాటు అటువైపుగా వెళ్లే రహదారుల్లో సైతం పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అటువైపుగా ప్రయాణించే అవకాశం లేదు. వాహనదారులందరూ జాతీయ రహదారి పైకి ఎక్కారు. దీంతో రెండో రోజు కూడా హైవేలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మద్దిలపాలెం నుంచి పీఎం పాలెం వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాధారణ రోజుల్లో పీఎంపాలెం నుంచి మద్దిలపాలెంకు 20 నుంచి 30 నిమిషాలు పట్టేది. కానీ బుధ, గురువారాల్లో మాత్రం రెండు గంటలకు పైగా పట్టింది. ఈ నెల 21వ తేదీ వరకు బీచ్ రోడ్డు వైపు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ముందుగానే సూచించారు. అయితే నగరంలో చాలా ప్రాంతాలకు ప్రత్యామ్నాయ రోడ్లు లేవు. జోడుగుళ్లపాలెం నుంచి సాగర్‌నగర్ వరకు, అలాగే అక్కడి నుంచి భీమిలి వరకు ఉన్న నివాసితులు బీచ్‌రోడ్డు లేదంటే జాతీయ రహదారిపైనే ప్రయాణించాల్సి ఉంటుంది. హనుమంతవాక జంక్షన్ దాటిన తర్వాత ఆనందపురం వరకు పెందుర్తి, ఆనందపురం హైవేకు వెళ్లే అవకాశం లేదు. దీంతో భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు, ఇతర కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బీచ్ రోడ్డులో నివాసితులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

4 గంటలకు రాకుంటే
రూ.500 ఫైన్

- డ్వాక్రా మహిళలకు లీడర్ల హెచ్చరికలు
- సోషల్ మీడియాలో మెసేజ్‌లు వైరల్

విశాఖ సిటీ: 'యోగాంధ్ర కార్యక్రమానికి తెల్లవారుజామున నాలుగు గంటలకే రావాలి.. లేదంటే రూ. 500 ఫైన్ కట్టాలి'.. అంటూ డ్వాక్రా మహిళల మొబైల్ ఫోన్లకు వస్తున్న మెసేజ్‌లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. యోగాంధ్ర వేడుకలను విజయవంతం చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. విశాఖ నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో జనాలను తరలించడానికి ఆప సోపాలు పడుతున్నారు. తెల్లవారుజాము 5.30 గంటలకే జనాలను కంపార్ట్‌మెంట్లలోకి చేర్చాలని గట్టి నిర్ణయంతో ఉన్నారు. అంటే వీరిని అర్ధరాత్రి 2, 3 గంటల సమయంలోనే బస్సులు, ఇతర వాహనాల్లో బీచ్‌రోడ్డుకు తీసుకురావాల్సి ఉంటుంది. కానీ ఆ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చే అవకాశం ఉంటుందా అన్న అనుమానం అధికారులను వేధిస్తోంది. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలను తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారి ఆదేశాల మేరకు గ్రూపు లీడర్లు మహిళలకు మెసేజ్‌లు చేస్తున్నారు.

బెదిరింపుల మెసేజ్‌లు

యోగాంధ్ర కార్యక్రమానికి 5 లక్షల మందిని సమీకరించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జనసమీకరణ బాధ్యతలను యూసీడీ, డ్వామా, ఎడ్యుకేషన్, ఇలా పలు శాఖలకు అప్పగించారు. అలాగే సచివాలయ సిబ్బందికి ప్రజల రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించారు. వారికి ఇచ్చిన లక్ష్యాల మేరకు సిబ్బంది తెలిసిన వారితో పాటు సచివాలయాలకు వచ్చే వారి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేపడుతున్నారు. ఇదిలా ఉంటే అర్ధరాత్రి సమయంలో జనాలు యోగాంధ్రకు వస్తారా? అన్న సందేశాలు అందరిలోను వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో డ్వాక్రా మహిళలను తీసుకురావాలని అధికారులు డ్వాక్రా గ్రూపు లీడర్లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు డ్వాక్రా మహిళలకు వ్యక్తిగతంగా మెసేజ్‌లు చేస్తున్నారు. 21వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని, లేదంటే రూ.500 ఫైన్ కట్టాలని ఆ మెసేజ్‌లో పేర్కొంటున్నారు. ఇప్పుడు ఈ మెసేజ్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఒకవైపు యోగాసనాలు వేసే వారినే తీసుకురావాలని స్వయంగా సీఎం చంద్రబాబు అధికారుల సమీక్షలో తేల్చి చెప్పారు. కానీ డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలను సైతం ఈ యోగాంధ్ర కార్యక్రమాన్ని తరలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాని వారికి ఫైన్ల పేరుతో బెదిరింపు మేసేజ్‌లు చేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి తరలింపులో తలనొప్పులు

యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమం ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. కానీ జనాలను ఉదయం 5.30 గంటలకే కంపార్ట్‌మెంట్లలోకి తరలించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. అయితే విశాఖ వాసులు ఉదయం 4 గంటలకు బయలుదేరితే 5 గంటలకు బీచ్ రోడ్డుకు చేరుకునే అవకాశం ఉంటుంది. అనకాపల్లి, అల్లూరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జనాలను అర్ధరాత్రి 2 గంటలకు బస్సులు, ఇతర వాహనాల్లో తరలించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అర్ధరాత్రి 2 గంటలకు బస్సులు బయలుదేరాలంటే.. గంట, రెండు గంటలకు ముందే వీరు ఆయా బస్సుల ప్రాంతాలకు చేరుకోవాల్సి ఉంటుంది. రాత్రే వీరిని పికప్ చేసుకోవాల్సి వస్తే రాత్రి భోజన ఏర్పాట్లు చేయాల్సి వస్తుంది. అలాగే వీరికి బాత్‌రూమ్, ఇతర సదుపాయాలు కల్పించడం కూడా అంత తేలికైన విషయం కాదు. ప్రతి వంద మందికి ఒక టాయిలెట్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఆ టాయిలెట్లు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో రాలేనట్లు తెలుస్తోంది. వాటిని ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల మధ్యలో బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఇవి యోగాకు వచ్చే వారికి సరిపోవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ సమస్యలన్నింటినీ అధిగమించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులు గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది.

సచివాలయాలే దిక్కయ్యాయి

- సెక్రటేరియట్ల వారీగా యోగాంధ్రకు జన సమీకరణ
- ప్రజల సంఖ్యకు అనుగుణంగా బస్సుల ఏర్పాటు
- సచివాలయాలు వద్దన్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు వాటిపైనే ఆధారం
- పథకాలు అమలు నుంచి కార్యక్రమాల నిర్వహణ వరకు వారిపైనే భారం



విశాఖ సిటీ : యోగాంధ్ర వేడుకలకు వార్డు, గ్రామ సచివాలయాలు కీలకంగా మారాయి. వీటి కేంద్రంగానే జన సమీకరణ జరుగుతోంది. పదులు, వందల్లో కాదు.. లక్షల్లో జనాలను సచివాలయాల వారీగా తరలింపు ప్రక్రియ సాగుతోంది. నిన్న మొన్నటి వరకు సచివాలయ వ్యవస్థపై నోరుపారేసుకున్న కూటమి ప్రజాప్రతినిధులకు ఇప్పుడు ఆ సచివాలయాలే దిక్కయ్యాయి. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ నుంచి భారీ కార్యక్రమాల నిర్వహణ వరకు అన్నింటికీ సచివాలయాల ఉద్యోగులే కీలకంగా మారారు. ఒకవైపు ప్రభుత్వ పథకాలు అమలు, ధ్రువపత్రాల జారీ, రేషన్‌కార్డుల నమోదు ప్రక్రియతో పాటు మరోవైపు యోగాంధ్ర రిజిస్ట్రేషన్ బాధ్యతలను వీరికే అప్పగించారు. ఈ నెల 21వ తేదీన బీచ్ రోడ్డులో జరిగే యోగాంధ్ర వేడుకల్లో 5 లక్షల మందితో యోగాసనాలు చేయించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులకు ఎక్కాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ల లక్ష్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ వేడుకలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానుండడంతో.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించింది. ఇందుకు గాను జనాలను తరలించే బాధ్యతలను సచివాలయాలకు అప్పగించింది. ముందుగా ప్రజల రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచడానికి కూడా సచివాలయ ఉద్యోగులకు టార్గెట్లను నిర్దేశించింది. ఒక్కో ఉద్యోగి వెయ్యి మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సచివాలయ సిబ్బంది తమకు తెలిసిన వారితో పాటు కార్యాలయాలకు వచ్చిన వారిని బతిమలాడుతూ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

తరలింపు బాధ్యత సచివాలయాలదే..

జన సమీకరణతోపాటు వారిని నిర్దేశిత కంపార్ట్‌మెంట్లకు తరలించే బాధ్యతను సచివాలయాలకే అప్పగించారు. ఎవరు ఎక్కడ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. వారి చిరునామా ఆధారంగా సచివాలయం సిబ్బంది వారికి ఫోన్లు చేస్తున్నారు. సంబంధిత సచివాలయం ఏర్పాటు చేసిన వాహనాల్లోనే వీరు బీచ్ రోడ్డుకు చేరుకోవాల్సి ఉంటుంది.

అయోమయంలో విద్యార్థులు

జన సమీకరణ బాధ్యతలను అధికారులు కొన్ని శాఖలకు అప్పగించారు. అందులో విద్యా శాఖ కూడా ఉంది. హైస్కూళ్లు, కాలేజీల నుంచి సుమారు 50 వేల మంది విద్యార్థులను తరలించాలని విద్యా శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించారు. వీరి ఆదేశాల మేరకు జిల్లా అధికారులు సైతం ఆయా స్కూళ్లు, కాలేజీలపై ఒత్తిడి తీసుకువచ్చారు. విద్యార్థులను యోగాంధ్రకు తీసుకురావాలని తేల్చి చెప్పారు. దీంతో కొన్ని కాలేజీలు తమ బస్సుల్లోనే విద్యార్థులను నేరుగా తీసుకువస్తామని చెప్పారు. అయితే అలా కుదరదని, విద్యార్థుల చిరునామా ప్రకారం వారి సచివాలయాల ద్వారానే రావాల్సి ఉంటుందని, బస్సులను ఆయా సచివాలయాలకు అప్పగించాలని ఆదేశించారు. దీంతో కొన్ని కాలేజీల యాజమాన్యాలు బస్సులను అప్పగించారు. ఇప్పుడు మళ్లీ ఎవరి విద్యార్థులను వారే తీసుకురావాలని కొన్ని కాలేజీలకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. అయితే తమ కాలేజీ బస్సులు సచివాలయాలు అప్పగించేశామని, విద్యార్థులను ఎలా తీసుకువెళ్లాలని కాలేజీ యాజమాన్యాల నుంచి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. యోగాంధ్ర కార్యక్రమానికి కేవలం ఒక రోజు మాత్రమే సమయం ఉండడంతో దీనిపై నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

స్వయంగా మీరే హాజరు కండి!

- అనకాపల్లి ఎక్సైజ్ అధికారులకు లోకాయుక్త ఆదేశం
- హోం మంత్రి నియోజకవర్గంలో లిక్కర్‌షాపు ఏర్పాటుపై షాక్
- జాతీయ రహదారి పక్కనే అనుమతి ఇచ్చిన అధికారులు
- ఫిర్యాదు వచ్చినా నోటీసుల పేరుతో కాలయాపన
- కోర్టుకెళ్లి స్టే తెచ్చుకునే వరకు దాటవేత
- చివరకు స్టే వచ్చిందంటూ కనీసం కన్నెత్తి చూడని వైనం
- లోకాయుక్తను ఆశ్రయించడంతో తాజాగా నోటీసుల జారీ

హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో జాతీయ రహదారికి అతి సమీపంలో లిక్కర్ షాపు ఏర్పాటుపై ఎక్సైజ్ పోలీసులకు లోకాయుక్త షాక్ ఇచ్చింది. ఈ వ్యవహారంలో స్వయంగా వచ్చి తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది.



ఎస్.రాయవరం మండలంలోని పెద్దగుమ్మలూరులో హైవేకు సమీపంలో నడుపుతున్న వైన్ షాపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎస్.రాయవరం మండలంలోని పెద్దగుమ్మలూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్ జాతీయ రహదారికి కేవలం 140 మీటర్ల దూరంలోనే ఉంది. అయినా ఈ షాపు ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు అనుమతినిచ్చారు. జాతీయ రహదారికి 220 మీటర్ల అవతల మాత్రమే లిక్కరు షాపు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టంగా తన తీర్పులో పేర్కొంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా అనుమతినిచ్చారు. దీనిపై పలు దఫాలుగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎక్సైజ్ అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. నోటీసుల పేరుతో తాత్సారం చేసి... చివరకు స్టే వచ్చిందంటూ అటువైపుగా వెళ్లకుండా, చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు. దీంతో లోకాయుక్తను కొద్ది మంది ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు ఆగస్టు 6వ తేదీన స్వయంగా తమ వద్ద హాజరు కావాలంటూ లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. చాలా తక్కువ కేసుల్లో మాత్రమే స్వయంగా హాజరు కావాలనే ఆదేశాలను లోకాయుక్త జారీ చేస్తుందని తెలుస్తోంది. స్వయంగా హోం మంత్రి నియోజకవర్గంలోనే నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతూ... ఇష్టారీతిలో లిక్కర్ అమ్మకాలు కొనసాగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ పేరుతో కాలయాపన...!

వాస్తవానికి జాతీయ రహదారికి అతి సమీపంలో షాపు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిందే ఎక్సైజ్ అధికారులు. స్వయంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) వచ్చి మరీ అనుమతులు మంజూరు చేసినట్టు తెలుస్తోంది. దీనిపై స్థానికంగా వ్యతిరేకత రావడంతోపాటు సుప్రీంకోర్టు విధించిన నిబంధనలకు విరుద్ధంగా అనుమతి ఎలా ఇచ్చారంటూ కొందరు నేరుగా ఎక్సైజ్ అధికారులకు జనవరి నెలలోనే ఫిర్యాదు చేశారు. అయితే, తామే అనుమతి ఇచ్చినందున ఎక్సైజ్ అధికారులు... పట్టించుకోకుండా ఉండిపోయారు. దీంతో నేరుగా సీఎం గ్రీవెన్స్ సెల్‌తో పాటు మంత్రి లోకేష్ గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లి మరీ ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఈ ఫిర్యాదుపై విచారణ పేరుతో కాలయాపన చేశారు. అనంతరం అనకాపల్లి ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇస్తున్నట్టు అనకాపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ బదులిచ్చారు. వారికి తీరిగ్గా నోటీసులు ఇచ్చి... హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేందుకు అవకాశం ఇచ్చారనే విమర్శలున్నాయి. అనుమతి ఇచ్చిన ఎక్సైజ్ అధికారులే ఇప్పుడు నోటీసులు ఇచ్చారంటూ వాదించి హైకోర్టు నుంచి స్టే తెచ్చుకునేందుకు పరోక్షంగా దోహదం చేశారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారు గుర్రం నానాజీ లోకాయుక్తను ఆశ్రయించారు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఏకంగా వైన్ షాపు ఏర్పాటు చేసిన వైనం... ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకుండా తాత్సారం చేసిన తీరుపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. దీంతో ఏకంగా వ్యక్తిగతంగా తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు జారీ అయినట్టు సమాచారం.

మామూళ్లు ఇచ్చి ఏమైనా చేసుకోండి...!

అనకాపల్లి జిల్లాలో పాయకరావుపేటతోపాటు యలమంచిలి నియోజకవర్గంలో లిక్కర్ సిండికేట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి. తాము ఏమీ చేసినా అటు ఎక్సైజ్ అధికారులు కానీ... ఇటు పోలీసు సిబ్బంది కానీ ఏమీ చేయరనే ధీమాతో లిక్కర్ సిండికేట్ ఉందనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి సందర్భంగా రెండు నియోజకవర్గాల్లోనూ కోడిపందాలతోపాటు బహిరంగంగా మద్యం విక్రయాలు జరిగాయి. అంతేకాకుండా పేకాట శిబిరాలను కూడా నిర్వహించారు. ఈ ధైర్యంతోనే రెండు నియోజకవర్గాల్లోనూ లిక్కర్ షాపు యాజమాన్యాలు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి. బెల్టు షాపులను కూడా భారీ సంఖ్యలో నిర్వహిస్తున్నారు. ఇక నేరుగా వైన్ షాపుల్లోనే అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. అంతేకాకుండా ఎక్సైజ్ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి నేరుగా ఏయే షాపు నెలవారీగా ఎంత మొత్తం ఇవ్వాలో పేర్కొంటూ కొద్దిరోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అటు ఎక్సైజ్, ఇటు పోలీసు సిబ్బంది నెలవారీగా దండుకుంటూ చూసీచూడనట్టు మొత్తం వ్యవహారాలను నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా లోకాయుక్త నోటీసులతోనైనా వీరి వ్యవహారం మారుతుందా? లేదా అనేది చూడాల్సి ఉంది.

తుది దశకు ఏర్పాట్లు



ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆర్.కె బీచ్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న ప్రధాన వేదిక దాదాపు పూర్తయింది. కార్యక్రమాన్ని తిలకించే అతిథుల కోసం కుర్చీలు, ప్రత్యేక ఎల్ఈడీ టీవీలు, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆర్.కె బీచ్ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు రహదారిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సాగర తీరాన్ని హరితమయం చేస్తున్నారు. యోగా కార్యక్రమంలో పాల్గొనే ప్రజల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి, నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. తీరం పొడవునా భారీ ఎల్ఈడీ తెరలు, లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా ఎల్ఈడీ స్క్రీన్లు ఇప్పటికే సిద్ధమయ్యాయి. వీటిని గురువారం విజయవంతంగా పరీక్షించారు. ఇసుక తిన్నెలపై కూడా భారీ వేదిక, ఎల్ఈడీ తెరలు, లైట్లు అమరుస్తున్నారు. శుక్రవారం పూర్తిస్థాయిలో కంపార్ట్‌మెంట్‌ల నిర్మాణం, గ్రీన్ మ్యాట్ వేసే పనులు ప్రారంభం కానున్నాయి. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా ప్రధాన వేదికపై పైకప్పు ఏర్పాటు చేశారు. ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో కూడా వేదిక, ఇతర ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. రెండు ప్రధాన వేదికల వద్ద యోగా చేసే ప్రజల కోసం బారికేట్లు, కంపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

గవర్నర్‌కు స్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం విశాఖపట్నం చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన నోవాటెల్‌కు చేరుకున్నారు. రాత్రికి అక్కడ బస చేస్తారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నోవాటెల్ నుంచి మహారాణిపేట వెళ్తారు. తిరిగి నోవాటెల్‌కు చేరుకుని సాయంత్రం 5.50 గంటల వరకు అక్కడే ఉంటారు. సాయంత్రం 6.25 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతారు. శనివారం బీచ్‌రోడ్డులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

మహారాణిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఐఎన్ఎస్ డేగా వెళ్లి కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 6.40 గంటలకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతారు. రాత్రి 7.30 గంటలకు అక్కడ నుంచి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 6.10 గంటలకు కలెక్టరేట్ నుంచి ఆర్కే బీచ్‌కు బయలు దేరుతారు. 6.20 గంటలకు గవర్నర్‌కు, 6.25 గంటలకు ప్రధానికి స్వాగతం పలుకుతారు. 6.30 నుంచి 7.50 గంటల వరకు ప్రధానితో కలిసి యోగా విన్యాసాల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు చేరుకొని 11.45 గంటల వరకు ఉంటారు. 11.50 గంటలకు విశాఖ విమానాశ్రయంలో ప్రధానికి వీడ్కోలు పలుకుతారు. మధ్యాహ్నం 12.40 గంటలకు విమానంలో బేగంపేట బయలుదేరుతారు.

ప్రజల తరలింపునకు 2,085 బస్సులు

మద్దిలపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ వేడుకల కోసం జిల్లా నలుమూలల నుంచి ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ పటిష్టమైన చర్యలు చేపట్టింది. మొత్తం 2,085 బస్సులను సిద్ధం చేసింది. ఇందులో 1,300 ఆర్టీసీ బస్సులు, 785 ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల తరలింపునకు 500, పట్టణ ప్రాంతాల ప్రజల తరలింపునకు 800 ఆర్టీసీ బస్సులను కేటాయించారు. కేవలం విశాఖ రీజియన్ నుంచే 550 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. వీటికి అదనంగా ఆటోలు, వ్యాన్లు వంటి వాహనాలు అందుబాటులో ఉంటాయి. ఇవన్నీ 20వ తేదీ మధ్యాహ్నానికే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకుంటాయని ప్రజా రవాణా శాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేవారు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్‌లు మద్దిలపాలెం బస్ స్టేషన్‌తో పాటు పలుచోట్ల అందుబాటులో ఉంచారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆర్టీసీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

జూనియర్ కళాశాలలకు రెండు రోజుల సెలవులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖ వేదికగా జరగనున్న నేపథ్యంలో జిల్లా పరిధిలోని జూనియర్ కళాశాలలకు రెండు రోజులు సెలవులు ప్రకటిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు పి.మురళీధర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఈ నెల 20, 21వ తేదీల్లో జూనియర్ కళాశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని పేర్కొన్నారు.

బదిలీల రగడ

సమన్వయంతో రికార్డ్ సృష్టిద్దాం

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి డోలా

బీచ్‌రోడ్డు: సమన్వయంతో యోగాంధ్ర వేడుకలను విజయవంతం చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధిద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కంపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిలు, తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, ఐఏఎస్‌లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై గురువారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. యోగాంధ్ర రాష్ట్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మాట్లాడుతూ ప్రతి కంపార్ట్‌మెంట్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించామని, కంపార్ట్‌మెంట్‌లో సుమారు 600 నుంచి 1,300 మంది వరకు ఉంటారన్నారు. యోగా ప్రక్రియను పర్యవేక్షించేందుకు 2,600 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ ఐదు కిలోమీటర్లకు ఐదు పడకల ఆసుపత్రిని కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నిర్మానుష్య ప్రాంతాల్లో పాములు, ఇతర విష కీటకాలు రాకుండా అటవీ శాఖ చేత మందులు పిచికారీ చేయిస్తున్నామని, అలాగే 35 మంది పాములు పట్టేవారిని సిద్ధం చేశామన్నారు. సముద్రంలో గజ ఈతగాళ్లు కూడా సిద్ధంగా ఉంటారన్నారు. రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీసీసీ ఎండీ కల్పన, ఏపీఐఐసీ ఎండీ అభిషేక్, మూడు జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన హెడ్‌నర్సులు

- వైద్య ఆరోగ్య శాఖలో పైరవీల పర్వం
- నిబంధనలకు పాతరేస్తూ బదిలీలు
- 58 ఏళ్ల వయసున్న వారికి ఏజెన్సీలో పోస్టింగ్
- అన్యాయమంటున్న నర్సులు



కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నర్సులు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో పలు కేటగిరీల ఉద్యోగుల బదిలీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ఆంధ్రా మెడికల్ కాలేజీల్లో పలు కేటగిరీల్లో రెండు రోజుల కిందట ప్రారంభమైన బదిలీల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ముఖ్యంగా నర్సులు, ఏఎన్ఎంలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల్లో తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కొంతమందికి మేలు చేసే ఉద్దేశంతో అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను బుట్టదాఖలు చేసి, ఏకపక్షంగా వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు. పేరుకు నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటిలో ఒక్కటి కూడా బదిలీ ప్రక్రియలో అమలు చేయలేదని, భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని కావాల్సిన వారికి కావాల్సిన చోట పోస్టింగ్‌లు ఇచ్చారని సమాచారం.

అవినీతి కేసులో ఉన్నవారికి అందలం

సీనియర్ అసిస్టెంట్ బదిలీల్లో భాగంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులో పట్టుబడిన ఉద్యోగికి కీలకమైన పోస్టింగ్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. గతంలో ఆర్డీ కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు ఏసీబీకి పట్టుబడిన ఆ ఉద్యోగికి ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఏసీబీ కేసుల్లో చిక్కుకున్న వారికి ప్రాధాన్యం లేని(లూప్‌లైన్) పోస్టింగ్‌లు ఇవ్వాలి. కానీ ఇక్కడ నగర పరిధిలోనే పోస్టింగ్ ఇవ్వడం వెనుక కూటమి ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. అదేవిధంగా ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి అనకాపల్లి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోస్టింగ్ కేటాయించారు. మార్గదర్శకాల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. వైద్య ఆరోగ్య శాఖలో మొదటి నుంచి అన్నీ తేడా వ్యవహారాలే కాబట్టి.. అధికారులు చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు వస్తున్నాయి.

బదిలీల్లో కొరవడిన పారదర్శకత

హెడ్‌నర్సుల బదిలీల కౌన్సెలింగ్‌లో పారదర్శకత లోపించిందని పలు ప్రభుత్వ ఆసుపత్రుల హెడ్‌నర్సులు కేజీహెచ్ వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. వెంటనే కౌన్సెలింగ్‌ను రీకాల్ చేసి ఆఫ్‌లైన్‌లో తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు హెడ్ నర్సులు మాట్లాడారు. 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 ఏళ్లు దాటిన ఉద్యోగులను ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయకూడదు. కానీ 58 ఏళ్లు దాటిన సుమారు 55 మంది మహిళలను విశాఖపట్నం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తమలో చాలామందికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, పదవీ విరమణకు కూడా తక్కువ సమయం ఉందని, అయినప్పటికీ తమ విజ్ఞప్తిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదని వాపోయారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి ఏకపక్షంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారని, కౌన్సెలింగ్ సమయంలో తమ అభిప్రాయాలు చెప్పకుండా కంప్యూటర్‌ను మ్యూట్ చేశారని ఆరోపించారు. తమకు నచ్చినట్టే బదిలీలు చేస్తామని, వెంటనే ఆమోదపత్రాలు తీసుకోవాలని తమపై ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. అలాగే పైఅధికారుల ఒత్తిళ్లకు తలొగ్గి తక్కువ వయసు ఉన్నవారికి నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని విమర్శించారు. స్థానికులను కాదని, బయట నుంచి వచ్చిన వారికి నగరంలో ప్రాధాన్యమిచ్చారన్నారు. ఈ వయసులో ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ అయితే ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన చెందారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి డ్యూటీలు వేసినప్పటికీ, వెంటనే బదిలీ అయిన స్థానాల్లో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, ఆఫ్‌లైన్‌లో తిరిగి నిర్వహించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు అవస్థలు



భీమిలి, తగరపువలస బస్సులు సమయానికి రాకపోవడంతో వేచి ఉన్న ప్రయాణికులు, విద్యార్థులు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిర్వహించే ఏ కార్యక్రమానికైనా విశాఖ నుంచి ఆర్టీసీ బస్సులను తరలించడం పరిపాటిగా మారింది. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న, ప్రధాని మోదీ హాజరయ్యే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మరెన్ని బస్సుల్ని తరలిస్తారో.. చెప్పక్కర్లేదు. అసలే అరకొర ఆర్టీసీ బస్సులతో నడుస్తున్న విశాఖలో.. ఇలాంటి సమయంలో ప్రయాణికుల ఇక్కట్లు వర్ణనాతీతం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది.

విశాఖ రీజియన్ నుంచి 550 బస్సులు

ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. దీనికి ప్రధానితోపాటు, దేశ విదేశాల ప్రముఖులు రానుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా జనసమీకరణకు శ్రీకారం చుట్టారు. దాదాపు 5 లక్షల మందిని సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు విశాఖ రీజియన్ నుంచి 550 ఆర్టీసీ బస్సుల్ని కేటాయించారు. రాష్ట్రం నలు మూలల నుంచి జనసమీకరణకు 3,200 ఆర్టీసీ బస్సులను వినియోగిస్తుండటం గమనార్హం. సిటీ పరిధిలో ఆశించిన మేర సిటీ సర్వీసులు లేవు. దీంతో గురువారం సాయంత్రం నుంచే విద్యార్థులు, సాధారణ ప్రయాణికులకు తిప్పలు మొదలయ్యాయి.

బస్సులు తగ్గించేశారట..



అసలే చాలీచాలని బస్సులతో విద్యార్థులు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇలా ఎందరో నిత్యం ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్తుంటారు. యోగాంధ్ర పేరిట భారీగా బస్సులు తరలించేస్తే ఇక్కడి వారి పరిస్థితి ఏంటి?

– వర్రి నాగ అరుణ్‌కుమార్, ప్రయాణికుడు

పిల్లలతో ఎలా వెళ్లేది?



స్కూళ్లకు మూడు రోజులు సెలవులిచ్చారు. పిల్లల్ని మా సొంతూరు పార్వతీపురం తీసుకెళదామని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చా. గంటో.. గంటన్నరకో వచ్చిన బస్సు పూర్తిగా నిండిపోయింది. వేరే బస్సు కోసం వేచి ఉండే సరికి మళ్లీ రద్దీ పెరిగింది. ఇలాగైతే పిల్లలతో ఎలా వెళ్లగలం..?

– గర్రెడ్డి రమాదేవి, ప్రయాణికురాలు

కడుపుకొట్టిన యోగాంధ్ర

- ఇంటికే పరిమితమైన మత్స్యకారులు, చిరువ్యాపారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు



ఉప్పాడ తీరం వద్ద ఉంచిన వలలు

కొమ్మాది: బీచ్‌రోడ్డు జరగనున్న 'యోగాంధ్ర' కార్యక్రమం స్థానిక మత్స్యకారులు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రపంచ రికార్డు లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

రెండు రోజుల పాటు వేట నిషేధం

ఈ నెల 20, 21 తేదీల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే 60 రోజుల వేట విరామం తర్వాత జూన్ 15న తిరిగి వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఇది మరో దెబ్బ. జిల్లాలోని సుమారు 25 వేల మత్స్యకార కుటుంబాలు(లక్షన్నర మంది ప్రత్యక్షంగా, మరో లక్ష మంది పరోక్షంగా) దీనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. 'ఇప్పటికే పస్తులున్న మాకు ఇది చాలా కష్టం. ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలి' అని రాంబాబు అనే మత్స్యకారుడు కోరారు.

చిరు వ్యాపారుల బడ్డీల తొలగింపు: మంగమారిపేట, రామాద్రి తీర ప్రాంతాల్లో దాదాపు 30 దుకాణాలను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించారు. దీంతో ఈ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తమ సరకులు పాడవుతున్నాయని, ప్రత్యామ్నాయం చూపకుండా బడ్డీలు తొలగించడంపై అమర్‌నాథ్ అనే చిరు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్లకు ఇక్కట్లు

బీచ్ రోడ్డులో బారికేడ్లు వేసి మూసివేయడంతో గత మూడు రోజులుగా ఆటో డ్రైవర్లు పనిలేక ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఫైనాన్స్ కట్టలేకపోతున్నామని శివ అనే ఆటో డ్రైవర్ వాపోయారు. యోగాంధ్ర ఏర్పాట్లు వందలాది మంది ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశాయని ఆయన పేర్కొన్నారు.

యోగాంధ్రకు తరలిరండి

రాష్ట్ర మంత్రుల పిలుపు



వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రులు, అధికారులు, జిల్లా ప్రజలు

ఏయూక్యాంపస్: యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆయుష్ శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ కేంద్రం నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వరకు గురువారం వాక్‌థాన్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, సవితలతో కలిసి ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఆయుష్ కార్యదర్శి రాజేష్ కొట్చా మాట్లాడుతూ యోగాంధ్రలో ప్రజలంతా భాగం కావాలన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు మాట్లాడుతూ యోగాంధ్ర విజయంతో ప్రపంచానికి మంచి సందేశం అందించాలని కోరారు. యోగాపై వివిధ పోటీలు నిర్వహించి 25 లక్షల మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు వెల్లడించారు. వీరంతా ప్రధాన వేదికలో యోగాసనాలు వేస్తారన్నారు. అనంతరం అధికారులు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద యోగాసనాలు వేశారు. యోగా అభ్యాసకులకు అధికారుల చేతులమీదుగా టీషర్ట్స్ అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, సీనియర్ ఐఏఎస్ అధికారులు సురేష్ కుమార్, వీరపాండ్యన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నరసింహారెడ్డి, పరశురామ్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో విద్యార్థులతో యోగా.. ఎలా?

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న నగరంలో జరగనున్న 'యోగాంధ్ర' కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు శుక్ర, శనివారాలు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలన్నింటికీ ఈ సెలవు వర్తిస్తుంది. అయితే శుక్రవారం సెలవు ప్రకటించినప్పటికీ ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేసినట్లు ఫొటోలు తీసి 'లీప్ యాప్'లో అప్‌లోడ్ చేయాలని డీఈవో సూచించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. సెలవు రోజు పిల్లలు ఎలా వస్తారు? వారిని పాఠశాలకు ఏ విధంగా తీసుకురావాలంటూ మల్లగుల్లాలు పడుతున్నారు. అధికారుల ఆదేశాల ప్రకారం ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయకపోతే ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క పాఠశాలలకు సెలవు ప్రకటించి మరో పక్క విద్యార్థులను ఎలా రప్పించగలమంటూ ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఈ విషయంలో వెసులుబాటు కల్పించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కేంద్ర పాఠశాలలకూ సెలవు వర్తిస్తుంది

జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలతో పాటు కేంద్ర పాఠశాలలు కూడా శుక్ర, శనివారాలు సెలవు పాటించాలని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

అదానీ గంగవరం పోర్టుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టుకు 24వ గ్లోబల్ గ్రీన్‌టెక్ ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టైనబిలిటీ అవార్డ్స్–2025 లభించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోర్టు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు గ్రీన్ టెక్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. జాతీయ స్థాయిలో అవార్డు రావడం తమపై మరింత బాధ్యత పెంచిందని పోర్టు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. అనంతరం గ్రీన్ టెక్ ఫౌండేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

1,400 కొత్త బస్సులు వచ్చాయి..

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- ద్వారకా బస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

డాబాగార్డెన్స్ : రాష్ట్రంలో 1400 కొత్త బస్సులు అందుబాటులోకి తెచ్చామని, త్వరలో మరికొన్ని ఎలక్ట్రికల్ బస్సులతో పాటు డీజిల్ బస్సులు కూడా వస్తాయని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ద్వారకా బస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విశాఖకు కేటాయించిన 100 ఎలక్ట్రికల్ బస్సుల్లో 50 బస్సులు సింహపురి కాలనీ డిపో, 50 బస్సులు గాజువాక డిపోకి అందించామన్నారు. విశాఖకు మరిన్ని బస్సులు పెంచి, ప్రయాణికుల అవసరాలు తీర్చేలా చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. సీఎంఆర్, స్టాల్స్ అసోసియేషన్ సౌజన్యంతో ద్వారకా బస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు తదితరులు పాల్గొన్నారు.

లాసెట్‌లో 2,4 ర్యాంకులు మనవే..

రాష్ట్రస్థాయిలో రామ్ తేజ్ వర్మకు రెండో ర్యాంకు, శ్రావ్యకు నాల్గవ ర్యాంకు

ఎంవీపీకాలనీ/కంచరపాలెం : లాసెట్ 2025 ఫలితాల్లో విశాఖపట్నం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ముదునూరి రామ్ తేజ్ వర్మ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించగా, గొర్లె శ్రావ్య నాలుగో ర్యాంకుతో సత్తా చాటారు.

లక్ష్యం ప్రొఫెషనల్ కెరీర్



నగరంలోని లాసన్స్ బే కాలనీకి చెందిన ముదునూరి రామ్ తేజ్ వర్మ లాసెట్–2025లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించి ప్రతిభ చూపాడు. ప్రొఫెషనల్ ఉద్యోగం చేయాలనే లక్ష్యంతోనే తాను లాసెట్ రాసినట్లు రామ్ తేజ్ వర్మ తెలిపారు. అతని తండ్రి ముదునూరి విజయ్‌కుమార్ రాజు నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవలే పదవీ విరమణ చేశారు. తల్లి ధనలక్ష్మి గృహిణి. రామ్ తేజ్ వర్మ 2013లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంటెక్ సివిల్ ఇంజినీరింగ్ (స్ట్రక్చరల్ ఇంజినీరింగ్) పూర్తి చేశారు. అనంతరం రెండేళ్లు సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని గురునానక్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. మూడున్నరేళ్లపాటు తిరుపతిలోని కేఎస్ఆర్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు సివిల్స్ కోచింగ్ ఇచ్చారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యతో పాటు ప్రొఫెషనల్ కెరీర్ కూడా ఉండాలన్న అభిప్రాయంతోనే లాసెట్ పరీక్షకు సిద్ధమయ్యానని రామ్ తేజ్ వర్మ వివరించారు. ఈ విషయంలో హైకోర్టు న్యాయవాది, తన పిన్ని శ్రీదేవి తనకు ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడం తనకు చాలా ఆనందంగా ఉందని, న్యాయవాదిగా సేవలు అందించాలన్న తన లక్ష్యానికి ఈ ర్యాంకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ ర్యాంకు ద్వారా ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో లా కోర్సులో చేరతానని తెలిపారు. అయితే ఎన్‌క్యాట్ (జాతీయ స్థాయి లా ఎంట్రన్స్ టెస్ట్) కూడా రాస్తానని చెప్పారు. అందులో మంచి ర్యాంకు వస్తే హైదరాబాద్ నల్సార్ లా కళాశాల లేదా బెంగళూరులోని నేషనల్ లా కళాశాలలో న్యాయ విద్యను అభ్యసిస్తానని రామ్ తేజ్ వర్మ పేర్కొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి అవుతా



తాటిచెట్లపాలెం, కైలాసపురానికి చెందిన గొర్లె శ్రావ్య లాసెట్ 2025 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. గురువారం విడుదలైన ఫలితాల్లో శ్రావ్య 107 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచారు. జూలై 13న జరగనున్న జేసీజే (జూనియర్ సివిల్ జడ్జి) ఎంట్రన్స్ పరీక్ష రాసి జూనియర్ సివిల్ జడ్జి కావాలనే లక్ష్యంతో ఆమె శ్రమిస్తున్నారు. శ్రావ్య తండ్రి గొర్లె చంద్రరావు విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో పనిచేస్తూ.. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్‌కు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. శ్రావ్య అక్క గొర్లె సింధు క్యాట్ రాసి ఐఐఎం ఉదయపూర్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. ప్రస్తుతం బెంగళూరులోని జేపీ మోర్గాన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. తల్లి గొర్లె పార్వతి గృహిణిగా ఉంటూ, పిల్లల ఉన్నత చదువులను దగ్గరుండి చూసుకుంటున్నారు. లాసెట్‌లో ర్యాంకు సాధించిన శ్రావ్యను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

అధికార పార్టీకి సమాచార శాఖ దాసోహం

మహారాణిపేట: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలవాల్సిన సమాచార పౌరసంబంధాల శాఖ అధికార తెలుగుదేశం పార్టీ సేవలో తరలిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ శాఖ.. రాజకీయ పార్టీకి చెందిన అంతర్గత కార్యక్రమ వివరాలను అధికారిక మాధ్యమాల్లో పంచుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గురువారం తెలుగుదేశం జిల్లా కార్యాలయంలో మంత్రి పి. నారాయణ ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంబంధించిన ముఖ్యాంశాలు, ఫొటోలను డిప్యూటీ డైరెక్టర్ ఐ అండ్ పీఆర్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక ప్రకటనలు, మంత్రుల పర్యటనల వివరాలు, ప్రజా సంక్షేమ పథకాల సమాచారం పంచుకోవడానికి మాత్రమే ఈ గ్రూప్‌ను ఉపయోగిస్తారు. ఇందులో ప్రభుత్వ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఒక రాజకీయ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఎన్నడూ లేని విధంగా అధికారిక గ్రూప్‌లో పెట్టడంతో సభ్యులు నివ్వెరపోయారు.

సచివాలయం యూనిట్‌గా ప్రజల తరలింపు

యోగాంధ్ర ఏర్పాట్లపై మంత్రి దిశానిర్దేశం

మహారాణిపేట: 'యోగాంధ్ర' కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, వారి సౌకర్యార్థం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం సహచర మంత్రులతో కలిసి పార్టీ నేతలకు పలు అంశాలపై సూచనలు చేశారు. ఆ తర్వాత ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకున్న మంత్రి రవాణా, ఫుడ్ కమిటీ సభ్యులతో సమావేశయ్యారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్‌తో బాగ్చితో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రవాణా కోసం పలు జిల్లాల నుంచి మొత్తం మొత్తం 7,295 ప్రైవేట్, ప్రభుత్వ బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజలను తరలిస్తున్నామని, ట్రాఫిక్ సమస్యలు రాకుండా బస్సులను దశలవారీగా నగరానికి రప్పించి, తిరిగి పంపేలా ప్రణాళిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 26 కిలోమీటర్ల మేర యోగా విన్యాసాలు చేయనున్నట్లు తెలిపారు. హాజరయ్యే ప్రజల కోసం భారీ ఎత్తున ఆహారం, మంచినీటితో పాటు 4,000 తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రధాని భద్రతా కారణాల దృష్ట్యా ప్రజలు ఉదయం 5.30 గంటలలోపు తమకు కేటాయించిన స్థానాలకు చేరుకోవాలని, ఆ తర్వాత అనుమతి కష్టమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. తర్వాత మంత్రులు పార్థసారథి, దుర్గేశ్, అధికారులతో కలిసి కంపార్ట్‌మెంట్ ఇన్‌చార్జిలతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు.

ఐటీఐలో 2వ విడత ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం : జిల్లాలో వివిధ ప్రభుత్వ/ప్రైవేటు పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)ల్లో 2025–26 విద్యా సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలకు ఈ నెల 20 నుంచి జూలై 15లోగా iti.ap.gov.in అను వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు.